

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

07 అక్టోబర్ 2025 పేజీలు : 08


ప్రజల భాగస్వామ్యంతోనే..

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

## విజయవంతం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో 2025 స్వచ్ఛత అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విజన్ 2047లో భాగంగా స్వచ్ఛంద కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ముఖ్యమంత్రి పది సూత్రాల కార్యక్రమం నిర్దేశించారన్నారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు అయితేనే తమ తమ పరిసరాలు పరిశుభ్రంగా మారతాయని వివరించారు. గ్రామస్థాయి నుండి వివిధ వర్గాల వారికి స్వచ్ఛత అవార్డులు ప్రకటించడం సంతోషదాయకమని వారి స్ఫూర్తితో మిగతావారు సైతం స్వచ్ఛత కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. తమ తమ

మిగతా 2లో

- 70 తోపుడు బండ్లు, 5 ఇస్త్రీ బండ్లు నిరుపేదలకు పంపిణీ
- ఏడాదిలో 476 మంది పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేసిన మంత్రి నారాయణ
- సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 విధానం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తామన్న మంత్రి




చిరు వ్యాపారుల

# కళ్లల్లో ఆనందం చూస్తున్నాం

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

పేదరికం నుంచి వచ్చాను కాబట్టే పేదల కష్టాలు తెలుసని, అందుకే సొంత నిధులతో తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం 75 మంది పేదలకు తోపుడు బండ్లు మంత్రి అందజేశారు. అందులో 70 తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లు అందించారు. ఇప్పటివరకు 476 మందికి తోపుడు బండ్లు మంత్రి ఆధ్వర్యంలో అందజేశారు. పూరి గుడిసెలో పుట్టి ఎన్నో కష్టాలు పడ్డానని, తనకు కష్టం విలువ తెలుసు కాబట్టే పేదలకు సాయం చేస్తున్నాని, పేదలు నిరుపేదలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. తమ కష్టాలను తెలుసుకొని తమకు అండగా నిలిచిన మంత్రి నారాయణకు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. తోపుడు బండ్ల పంపిణీని కూడా వైఎస్సార్సీపీ నేతలు అడ్డుకున్నారని, ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పేదలకు సహాయం అందకుండా చేశారని మండిపడ్డారు. హైదరాబాద్ నుంచి తోపుడు బండ్లతో వస్తున్న లారీని సీజ్ చేయించారన్నారు. ఎన్నికల ప్రచారంలో వీధి వ్యాపారుల జీవన శైలి చూశానని.. అద్దెకు బండ్లు తీసుకొని వ్యాపారాలు చేసేవారు ఎక్కువ అని, అద్దె చెల్లించే అవసరం లేకుండా అండగా నిలుస్తానని ఆ రోజే హామీ ఇచ్చినట్లు తెలిపారు. లాండ్రీ వృత్తి చేసే పేద రజకులకు ఇస్త్రీ బండ్లు పంపిణీ చేస్తున్నానని, నా కుటుంబసభ్యులు కూడా పేదల పక్షపాతులని నారాయణ తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్‌లో వ్యాపారాలు చేసే 120 మంది మెప్మా మహిళలకు ఒక్కొక్కరికి లక్ష ఆర్థిక సహాయం ఇచ్చానన్నారు. సీఎం ప్రవేశపెట్టిన పీ4 ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు.

-మిగతా 6లో




కావలి మున్సిపాలిటీకి

## స్వచ్ఛంద అవార్డ్స్

**కావలి, మేజర్‌న్యూస్ :**

కావలి పురపాలకు పురపాలక సంఘం 2025 స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్‌లో భాగంగా నెల్లూరు జిల్లాలో స్వచ్ఛ మున్సిపాలిటీగా కావలి పురపాలక సంఘం ఎన్నికైంది. సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేతులమీదుగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ స్వచ్ఛ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎండి బషీర్, డీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ

## నిర్ణయం ఉపసంహరించుకోవాలి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు డీఆర్ ఉత్తమ్ హొటల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, వైసీపీ నెల్లూరు సిటీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్, నెల్లూరు రూరల్

- మిగతా 2లో

విచారణ జరిపి చట్టపరంగా

## న్యాయం చేస్తాం

జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల



02 పేజీలో

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

*(మొదటి పేజీ తరువాయి)*



నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డితో పాటు విద్యార్థి సంఘం నాయకులు, రిటైర్డ్ అధ్యాపకులు, పలువురు మేధావులు పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తూ తీసుకున్న నిర్ణయం అసంబద్ధ నిర్ణయమని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తమ అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వైద్య విద్య అభ్యసించాలనుకున్న పేద విద్యార్థులకు.. ఈ ప్రైవేటీకరణ నిర్ణయం ఒక శరాఘాతంగా మారనుందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని వైద్య విద్యను పేద ప్రజలకు చేరువ చేయాలని వారు కోరారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలను తీసుకురావడమనేది కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అందుకు సంబంధించిన అనుమతులన్నీ తీసుకురావడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న నిర్ణయమన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉండి కూడా రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేకపోయారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల ఉండాలనే లక్ష్యంతో ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకువచ్చి పేద ప్రజలకు విద్య, వైద్య సేవలను చెరువ చేసే దిశగా శ్రీకారం చుట్టారని తెలిపారు. ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున ఒక రాష్ట్రానికి ఇన్ని మెడికల్ కళాశాలలు తీసుకువచ్చిన ఘనత ఎక్కడా లేదన్నారు. దశలవారీగా వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి అడుగులు వేశారన్నారు. అనుకున్నది అనుకున్నట్టుగా 2023 ఏడాదిలో ఐదు మెడికల్ కళాశాలను జగన్మోహన్ రెడ్డి పూర్తి చేసి ప్రారంభించారని తెలిపారు. 2025కు మరో 5 కాలేజీలు పూర్తిచేసే లక్ష్యంతో 2024 ఏడాదిలో పాడేరు మెడికల్ కళాశాలను పూర్తి చేశారని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి ఒక లక్ష్య సాధనతో మెడికల్ కళాశాలలను పూర్తిచేసే దిశగా ప్రక్రియ ప్రారంభిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు ఈరోజు వాటన్నింటినీ నిర్వీర్యం చేసే దిశగా నిర్ణయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన మిగిలిన 11 మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలంటే 23 సంవత్సరాలు పడుతుందని చంద్రబాబు నాయుడు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి వసతులు సమకూర్చడం, అలాగే ఆర్బికేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ వార్డు సచివాలయాలను. ఇలా ఎన్నో సంస్కరణలను ఒక లక్ష్య సాధన దిశగా పూర్తి చేశారని గుర్తు చేశారు. 11 మెడికల్ కళాశాలల్లో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కేంద్ర నిధులతో పూర్తవుతుందని, మిగిలిన 10 కళాశాలలను పూర్తి చేసేందుకు 6 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని, దీనిని మేం భరించలేం.. అందుకే ప్రైవేట్‌కు ఇస్తున్నామని చంద్రబాబు చెబుతుండడం కుట్రపూరితమన్నారు. ముఖ్యంగా పులివెందుల మెడికల్ కళాశాల అన్ని వసతులతో పూర్తయిందని, కేవలం స్టాఫ్ మాత్రమే లేరని, వారిని మేము రిక్రూట్ చేసుకుంటామని చెప్పిన చంద్రబాబు ఈరోజు పులివెందుల మెడికల్ కళాశాలను పిపిపి మోడ్‌లో ప్రైవేటుకు అప్పగించడం సిగ్గుచేటన్నారు. 10 మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలంటే 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందన్న చంద్రబాబు నాయుడు.. మన రాష్ట్ర బడ్జెట్ 3 లక్షల కోట్ల రూపాయలు కాగా, అందులో 2 శాతం అంటే 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మెడికల్ కళాశాలలో పూర్తి చేయచ్చన్న కనీస ఆలోచన కూడా ఆయనకు చేయలేకపోవడం దౌర్భాగ్యం అన్నారు. లక్ష కోట్ల రూపాయలతో అమరావతి నిర్మిస్తామని చెబుతూ ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు.. మెడికల్ కళాశాలలను అందుబాటులో తీసుకురావడానికి 6 వేల కోట్ల ఖర్చు చేయలేకపోవడం విడ్డూరమన్నారు.

పేద ప్రజలకు వైద్య సేవలను చెరువ చేసే వ్యవస్థ మెడికల్ కళాశాల అని ఈరోజు అలాంటి మెడికల్ కళాశాల వ్యవస్థను చంద్రబాబు నాయుడు ప్రైవేటుపరం చేయడం అనాలోచిత నిర్ణయం అన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ద్వారా ఎంతోమందికి మెరుగైన వైద్య సేవలు అందించి వైద్యులు పారామెడికల్ సిబ్బంది వారి ప్రాణాలను కాపాడగలిగారని తెలి పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవల ఆవశ్యకతను గుర్తించి జగన్మో హన్ రెడ్డి నూతన మెడికల్ కళాశాలల ప్రారంభానికి శ్రీకారం చుడితే ఈరోజు మా వ్యవస్థలన్నీ చంద్రబాబు లాభాపేక్షతో ప్రైవేటుకు అప్పగించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి మార్చుకొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దిశగా తీసుకున్న నిర్ణయాన్ని సంహరించుకోవాలని లేదంటే భవిష్యత్తులో దీనిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరింత ఉధృత పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజయవంతం




*(మొదటి పేజీ తరువాయి)*

ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలనే తలంపు ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. ప్రజలందరి భాగస్వామ్యంతో స్వచ్ఛంద కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమవ్వాలని కోరారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పారిశుద్య కార్మికుల కృషితోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ దృష్ట్యా పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ముఖ్యమంత్రి సైతం ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాలు పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. మన ఊరిని మన ప్రాంతాన్ని ప్రేమించినప్పుడే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే అభిప్రాయం కలుగుతుందన్నారు. కష్టపడి పని చేసేవారికి ఇలాంటి అవార్డులతో గుర్తించినప్పుడే మరింత ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఉద్యమ స్ఫూర్తితో పనిచేసినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈవో బాలాజీ రావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, లోకేష్, కావ్య చిత్రపటాలకు పాలాభిషేకం

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో సోమవారం 20వ వార్డులో సచివాలయం వద్ద ఆటో కార్మికుల ఇబ్బందులు తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆటో వాలాలతో అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి వారి అకౌంట్లో 15 వేలు జమ చేసిన సందర్భంగా కచ్చిరమిట్లో సుమారు 19 ఆటోలతో జీవనం సాగిస్తున్న వారికి 15 వేలు జమ కావడంతో వాళ్ల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి. అందుకని వార్డు టీడీపీ నాయకులు తిరువీధి ప్రసాదు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మా కుటుంబాల అవసరాలు గమనించి ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

### జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 121 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, టౌన్ డీఎస్పీ సింధుప్రియా, లీగల్ అడ్వైజర్ టీ. శ్రీనివాసులు రెడ్డి, ఉమెన్ పీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్‌బీ సీఐ-2 శ్రీనివాస్ రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్నిలా..**

◆ సైదాపురం పరిధికి చెందిన వ్యక్తిని, కేశవరంనకు చెందిన సాయి, కవిత అనేవారు సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ. 8.30 లక్షల నగదు తీసుకుని సాఫ్ట్వేర్ జాబు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు.

◆ ఇందుకూరుపేట పరిధికి చెందినట వృద్ధురాలిని, తన జీవనోపాధికి హక్కుగా కలిగిన ఆస్తిని తన కుమారుడు రవిబాబు సాగు చేసుకోనీయకుండా బెదిరిస్తున్నాడని, వేధిస్తున్నాడని, కొట్టడానికి వస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.

◆ రాపూరు పరిధికి చెందిన వృద్ధురాలిని అదే ప్రాంతానికి చెందిన హరిశ్చంద్ర రెడ్డి అనే వ్యక్తి, తనకు హక్కుగా కలిగిన స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించినట్లు, తద్వారా తన మిగిలిన పొలానికి నీళ్లు కూడా పోకుండా ఇబ్బంది పడుతున్నట్లు, ఆక్రమించి కట్టిన ఇంటిని తొలగించమని అడగగా, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

◆ దర్గామిట్ట పరిధికి చెందిన మహిళ యొక్క ఇంట్లో, నెల్లూరు టౌన్‌కి చెందిన ముప్పాల పెంచల రాజు అనే వ్యక్తి నమ్మకంగా తన ఇంట్లో పనిచేస్తున్నట్లు, తన భర్త న్యూరో సమస్యతో బాధపడుతూ మంచం మీద ఉన్నట్లు, తన భర్త మొబైల్‌లో ఉన్న సిమ్ కార్డును దొంగిలించి, యూపీఐ ద్వారా 13 లక్షలు కాజేసినట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.

◆ బాలాజీ నగర్ పరిధికి చెందిన దివ్యాంగుని, తన తమ్ముడు శరత్ బాబు తన తండ్రితో కలిసి ఉంటున్న ఇల్లు ఖాళీ చేయాలని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.

◆ వేదాయపాలెం పరిధికి చెందిన మహిళ, తన కుమార్తె ప్రేమ వివాహం చేసుకున్నట్లు, ఆరోగ్యం బాగాలేక చనిపోయినట్లు, తన అల్లుడు ఖాదర్ బాషా నిర్లక్ష్యం కారణంగానే తన కుమార్తె మరణించిందని, అంతేకాకుండా తన మనవరాళ్ళను కూడా పట్టించుకోవడంలేదని, వారు బాగోగులు చూసుకోవడం లేదని విచారించి న్యాయం చేయాలని కోరారు.

◆ టిపి గూడూరు పరిధికి చెందిన మహిళను, భర్త అత్తమామలు మానసికంగా శారీరకంగా ఇబ్బందులు పెడుతున్నారని, సంవత్సరం నుండి ఇంటి నుండి తరిమివేశారని, దిక్కుతోచని స్థితిలో పుట్టింట్లో ఉంటున్నట్లు, అంతేకాకుండా భర్త రెండో పెళ్లి చేసుకున్నట్లు ఫిర్యాదు, విచారించి న్యాయం చేయాలని అదేవిధంగా లింగసముద్రం పరిధికి చెందిన మహిళను, తన భర్త ప్రతి చిన్న విషయానికి అనుమానిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, అంతేకాకుండా తన భర్త, అత్తమామలు, వారి కుటుంబ సభ్యులపై ఎటువంటి కేసు లు పెట్టకుండా ఉండాలని నోటరీ మీద బలవంతంగా సంతకం చేయించుకున్నాడని, మానసికంగా వేధిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.

విష్ణువర్ధన్ రెడ్డి, రామిరెడ్డి ఇద్దరు జగన్ కి కావలి రథసారథులు

# పెయిడ్స్ జర జాగ్రత్త : విష్ణు అనుచరులు హెచ్చరికలు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో సోమవారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్ కార్యాలయంలో వైసిపి నాయకులు, విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అనుచరులైన కృష్ణం రాజు, గోసల గోపాల్ రెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి రామిరెడ్డికి విభేదాలు ఉన్నట్లు కొందరు పెయిడ్ ఆర్టికల్స్ రాస్తూ సోషల్ మీడియాలో పెట్టడాన్ని దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వద్ద నెల జీతాలు తీసుకుంటూ ఓ చానల్లో పెయిడ్ ఆర్టికల్స్ వ్రాసి విష్ణువర్ధన్ రెడ్డికి జగన్మోహన్ రెడ్డి పదవి ఇచ్చి ప్రతాప్ కుమార్ రెడ్డిని పక్కన పెట్టినట్లు విష్ణువర్ధన్ రెడ్డికి ప్రతాప్ రెడ్డికి మాటలు లేనట్లుగా అసత్య కథనాలు వెల్లడించి తప్పుడు ప్రచారానికి తెరదీస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ప్రతాప్ రెడ్డి మాట్లాడుకున్నాకే వారి మధ్య సరోజ కుదిరిన తర్వాత వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా అధిష్టానం నియమించిందని తెలిపారు. ప్రతాపరెడ్డి అనుచరుల వద్దకు ముందు రోజే విష్ణువర్ధన్ రెడ్డికి వస్తుందని తెలిపారు. అలాంటప్పుడు తెలుగుదేశం పార్టీలో కూడా మాలేపాటి సుబ్బానాయుడుకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా బీద రవిచంద్ర కు ఎమ్మెల్సీగా చంద్రబాబు పదవులు ఇచ్చారని అలాంటప్పుడు ప్రస్తుతం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పక్కకు పడేసినట్ల అని ప్రశ్నించారు. ప్రతాప్ రెడ్డి పై అక్రమ కేసులు బనాయిస్తే విష్ణువర్ధన్ రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ప్రతాప్ కుమార్ రెడ్డిని పరామర్శించడం జరిగిందని, అలాగే జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు అందరూ ప్రతాపరెడ్డికి అండగా ఉన్నామని తెలిపారు. కావలి వైసీపీ ఇన్చార్జ్ ప్రతాప్ కుమార్ రెడ్డి ఉంటారని, ఆయన నాయకత్వంలో మేమందరం కలిసి పనిచేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇలాంటి అసత్య కథనాలు మరియు పెయిడ్ ఆర్టికల్స్, జీతాల కోసం పనిచేసే వారు మరల పునరావతం అయితే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. విష్ణువర్ధన్ రెడ్డి కి వైసీపీలో సెంట్రల్ కమిటీలో చోటు కల్పించిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణు అభిమానులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ నిర్మాణం



## దొంగ సర్టిఫికేట్‌తో కట్టడాలు కావలి ఉమెన్ ఫోర్స్ : సి.శారద

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక పుల్లారెడ్డి నగర్ సత్యనారాయణ స్వామి గుడికి అతి సమీపంలో విద్యా సంస్థలకు కూత వేటు దూరంలో ఒక భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారు. కాబట్టి ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ పెట్టే ఆలోచనతో ఉన్నారని, గతంలో ఎన్నోసార్లు ఆర్డీవో, కలెక్టర్లకు అర్జీలు సమర్పించి ర్యాలీలు నిర్వహించినట్లు ఉమెన్ ఫోర్స్ సి.శారద తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రేకుల షెడ్డు నిర్మాణానికి దొంగ సర్టిఫికెట్ ఫ్లెక్సీ గా తగిలించి బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకై నిర్మిస్తున్నట్లు తెలిపారు. సోమవారం పుల్లారెడ్డి నగర్ వాసులు ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్య లో సత్యనారాయణ స్వామి ఆలయ పూజారి ఇతర కమిటీ సభ్యులు ఉమెన్ ఫోర్స్ నేతలు కలిసి కావలి ఆర్డీఓ ఎస్.సన్నీ వంశీకృష్ణని కలిసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌ను ఆపేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని కూడా అందించడం జరిగింది. వారు ఫోన్ చేసి మున్సిపల్ అధికారులతో మాట్లాడగా, అది రేకుల షెడ్డు నిర్మాణానికి ఇచ్చిన అనుమతి అని చెప్పడం జరిగిందని తెలిపారు. రేకుల షెడ్డు నిర్మాణానికి అంత పెద్ద స్థానంలో పెద్ద భవనాన్ని ఎందుకు నిర్మిస్తున్నారని తెలపాలన్నారు. ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ గాని నిర్మాణమైతే ప్రాంతంలో నివసిస్తున్న వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, విద్యార్థుల మద్యానికి బానిసై వారి జీవితాలు అధోగతి పాలవుతుందని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి బార్ అండ్ రెస్టారెంట్ని నిలుపుదల చేయాలని ఉన్నత అధికారులు కోరారు. అలా కాదని నిర్మాణం జరిగితే ఉద్యమమే తప్పదని వారు హెచ్చరించారు.

# పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రతినిత్యం ఇబ్బందిగా ఉన్న మలుపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లిలో పోలీస్‌స్టేషన్ ఎదుట మలుపు ప్రతినిత్యం వాహనకార్లుకు అత్యంత ఇబ్బందికరంగా ఉంటూ ప్రమాదకర పరిస్థితి కలుగుతుంది. ఎల్ఆకారపు మలుపు కాగా రోడ్డు వెడల్పుగా లేనందున అక్కడ వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో వాహనాల డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బందిపడుతుండడంతోపాటు ద్విచక్రవాహనకారులు, పాదచారులు ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటుంటారు. మలుపు పెద్దది కాగా అక్కడ వాహనాలకు అనుకూలంగా రోడ్డు నిర్మించలేదు. మలుపుకు ఒకవైపు కాలువ ఉండగా ఆకాలువపై రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆవలివైపు రోడ్డును మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రతినిత్యంత అక్కడ వాహనాలు ఎదురునిలిచి డ్రైవర్లు ఇబ్బంది పడుతుండగా ట్రాఫిక్ స్థంబిస్తుంటుంది. ఇంతటి ఇబ్బందికర పరిస్థితి కలిగిన ఈమార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇబ్బందిని చూస్తుంటారు. కానీ ఎవరికి కూడా ఈపరిస్థితిని చక్కదిద్దాలని, ఇబ్బందులు తొలగించాలనే ఆలోచనే రాకపోతుండడం గమనార్హం. ఇప్పటికైనా స్పందించి ఈమలుపు వద్ద రోడ్డును విస్తరించి వాహనాలకు ఇబ్బందిలేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## గొలగమూడి ఈఓకు ప్రభుత్వం అండగా నిలవాలి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆశ్రమ విలువలను పలుచన చేస్తే సహించేది లేదని బిజెపి రాష్ట్ర నేత మిడతల రమేష్ విహెచ్పి విభాగ్ కార్యదర్శి ఏవిఆర్ మోహన్ రావు. నెల్లూరు జిల్లా అభివృద్ధి సంస్థ మెంబర్ పొట్లూరి శ్రీనివాసులు. ఏపీ తీర ప్రాంత మత్స్యకార పరిరక్షణ సమితి ఫౌండర్ చిట్టిబాబు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ బీసీవై పార్టీ కోవూరు ఇన్‌చార్జ్ సోమ గోపాల్ నెల్లూరు జిల్లా యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ యాదవ్‌లు కలెక్టర్ కార్యాలయంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నేతలు మాట్లాడుతూ.. ఒక ఆశ్రమానికి ఉండాల్సిన ధర్మాలన్నీ గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంలో ఉన్నాయన్నారు. ఆశ్రమ ఈవో బాలసుబ్రమణ్యంను హైకోర్టు నియమించిన తర్వాత ఆధ్యాత్మికతతోపాటు విద్య వైద్యం వసతి ఆహార సదుపాయాలు సమకూరాయి. కాలు లేని దివ్యాంగులకు జైపూర్ లెగ్‌లను ఉచితంగా అందిస్తున్నారు. గతంలో రోజుకి 300 మందికి పరిమితమైన ఉచిత భోజన ప్రసాదం నేడు సంవత్సరంలో లక్షల మందికి అందుతుంది. ఈవో జీతం తీసుకోకుండా సేవా దృక్పథంతో గొలగమూడి ఆశ్రమాన్ని జాతీయస్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేశారు. ఫిక్స్ డిపాజిట్లుతోపాటు ఆస్తులు అభివృద్ధి చేశారు. అటువంటి వ్యక్తిపై నిందారోపణలు చేసి ఆశ్రమ విలువలను పలుచన చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మానసికంగా బాలసుబ్రమణ్యం వేధించి తనంతట తాను వెళ్లిపోయేలా అర్థరహితమైన ఆరోపణలు స్థానికంగా ఉండే ఇద్దరు ముగ్గురు చేస్తున్నారు. బిజెపితో పాటు విహెచ్పి. పద్మశాలి సంఘం, యాదవ సంఘం, మత్స్యకార పరిరక్షణ సమితి, గో సంరక్షణ సమితి, బీసీవై పార్టీలు ఈవో బాలసుబ్రమణ్యంకు అండగా నిలబడతాయని ఆ నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వం గొలగమూడి ఈవోకు అండగా నిలబడాలని జెసికి నేతలందరూ కలిసి విజ్ఞప్తి చేశారు.

## ఈఓకు అండగా.. చేనేత పద్మశాలి సంఘాలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** దైవత్వం, ఆధ్యాత్మికం భంగం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన వస్తుందని హెచ్చరిస్తున్న పద్మశాలి సంఘ అధ్యక్షులు బుధవరపు బాలాజీ. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ.. ఈవో బాల సుబ్రహ్మణ్యం ఒక రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆయన పదవీ విరమణ తర్వాత టాటా కంపెనీలో పని చేసేవారు. గొలగమూడి దేవస్థానం అభివృద్ధి బాటలో నడిపించాలని న్యాయస్థానం ఆయనకి విన్నవించుకుంటే ఆయన గొలగమూడి దేవస్థానం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత స్వామివారి ఆస్తులు ఒకటికి పది రెట్లు అభివృద్ధి చేసి చూపించారు. ఆస్తులతో పాటు పేద పిల్లలకు పాఠశాలను, వికలాంగులకు కృత్రిమ అవయాల భాగాలను మరియు వైద్య రంగాన్ని పేదలకు అందిస్తున్నారు. అలాంటి గొప్ప మహోన్నత వ్యక్తి మీద అవినీతి ఆరోపణలు చేయడం దుర్మార్గమైన చర్య, దీనిని దైవ భక్తులతోపాటు, హిందూ కుల బాంధవులందరూ తీవ్రంగా ఖండించాల్సిన చర్య ఈ యొక్క దుర్మార్గమైన ఆరోపణలు చేసిన వ్యక్తులు వారి మీద ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలి. సమాజంలో అవినీతి పెరిగిపోయి మంచితనం తగ్గిపోతున్న రోజులు ఇలాంటి మహానుభావులు చేస్తున్న మంచి కార్యక్రమాల వలన భక్తులలో ప్రజలలో ఎంతో నమ్మకం కలుగుతుందని, ఆయన చేసే సేవా కార్యక్రమాల వలన సమాజం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఇలాంటి సమాజాన్ని భక్తులను భంగం కలిగించే వ్యక్తులు యెడల ధార్మిక సంస్థలు ఆధ్యాత్మిక సంస్థలు స్పందించి ఇలాంటి వారి మీద చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వానికి తెలిసే విధంగా లేఖలు రాయాలని వారు కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో పద్మశాలి సంఘ వర్కింగ్ వర్కింగ్ సోమ గోపాల్, ఉపాధ్యక్షులు కొప్పర్తి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, టౌన్ డిఎస్పి సింధు ప్రియా సూచనల మేరకు సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టే లక్ష్యంగా వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బుజబుజ నెల్లూరు, నాగమ్మ కాలనీ ప్రాంతంలో సిఐ కె.శ్రీనివాసరావు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది సుమారు 74 మందితో సోమవారం ఉదయం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా సుమారు ప్రతి ఇంటిని క్షుణ్ణంగా శోధించి, సరైన పత్రాలు లేని 13 బైకులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఏడు మంది రౌడీషీటర్లు, 13 మంది అనుమానితులను తనిఖీ చేసి వారి వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కఠినమైన ఆదేశాలు ఉన్నాయని, తమ సర్కిల్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, చట్టాలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న వారు, రికార్డులు లేని అన్ని వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వంటి వాటిని గుర్తించి స్వాధీనపర్చుకోవడమే ఈ యొక్క కార్డన్ సర్చ్ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలియజేశారు. అంతేకాకుండా అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు తెలియజేయాలని ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.

# సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం సోమశిలలో సోమవారం ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం కూటమి, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు ఉప్పల విజయ్ కుమార్, తెలుగు దేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు, సోమశిల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముక్కు పుల్లయ్య గౌడ్, మండల జనసేన పార్టీ నాయకులు ఎం.కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు వారి ఖాతాలో 15వేలు జమ చేసినందుకు అనంతసాగరం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఉప్పల విజయ్ కుమార్, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు, తెలుగుదేశం సోమశిల పార్టీ అధ్యక్షులు ముక్కు పుల్లయ్యగౌడ్, గ్రామ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జంజం నారాయణ, మండల తెలుగునాడు అధ్యక్షులు పోకల శ్రీనివాసులు రెడ్డి, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రహమాన్, సోమశిల ప్రాజెక్టు 69వ క్లస్టర్ ఇన్‌చార్జ్ పార్థసారథి నాయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షులు బత్తల నరేష్ యాదవ్, తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ కత్తి పెంచలయ్య, గ్రామ నాయకులు గువ్వల పెంచలయ్య, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, షేక్ షరీఫ్ సోమిశెట్టి సుబ్బారావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉప్పల విజయ్ కుమార్, శాఖమూరి సుబ్బారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమంలో ముందున్నా మన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి సినిమా హాల్ వరకు కూటమి నాయకులు ఆటో డ్రైవర్లతో మమేకమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి జైజైజై నినాదాలు చేశారు.

# కావలి బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు



**కావలి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా నూతన సూపర్నెంట్ ఆఫ్ పోలీస్‌గా అజిత్ వెజెండ్ల బాధ్యతలు తీసుకున్న తరువాత జిల్లా పోలీస్ యంత్రాంగంతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో నెల్లూరు జిల్లా ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని ఎక్కడ కూడా డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అజిత్ వేజెండ్ల వారి ఆదేశాల మేరకు సోమవారం కావలి ఒకటో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నియంత్రణలో భాగంగా కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కువ మంది ప్రయాణికులు క్రిక్కిరిసి ఉండడంతో సోమవారం పర్యవేక్షించారు. అక్కడ పరిస్థితులను సమస్యలను కంట్రోల్ రూమ్ వారిని అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అలాగే ఎవరైనా అల్లర్లు, డ్రగ్ విషయాల్లో ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే ద్విచక్ర వాహనాలు ఎక్కువగా దొంగతనానికి గురవుతున్నట్లు ఆటి విషయం కూడా నిఘా ఉంచామని, అలాగే కావలి పట్టణ ప్రజలు ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, బంగారం రోజు రోజుకి ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో మహిళలు తమ బంగారు ఆభరణాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని బయటకు వచ్చేటప్పుడు ఎక్కడికైనా వివాహాలు ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు రాత్రిపూట జాగ్రత్తగా ఉండాలని అలాగే ఎవరైనా అనుమానాల స్పదంగా సంచరిస్తున్న కొత్త వ్యక్తులు సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తగు సూచనలు సలహాలు 'సూర్య' దినపత్రిక ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నట్లు ఒకటవ పట్టణ సీఐ ఫిరోజ్ తెలిపారు.

## సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో సోమవారం 20వ వార్డు నందు సచివాలయం వద్ద ఆటో కార్మికుల ఇబ్బందులు తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటో వాలాలతో అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి వారి అకౌంట్‌లో 15వేలు రూపాయలు జమ చేసిన సందర్భంగా కచ్చిరమిట్లో సుమారు 19 ఆటోలతో జీవనం సాగిస్తున్న వారికి 15వేలు రూపాయలు జమ కావడంతో వాళ్ల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి. అందుకని వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు తిరువీధి ప్రసాదు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ మరియు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మా కుటుంబాల అవసరతలు గమనించి ఆర్థిక సహాయని అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 500 మంది క్రైస్తవులకు వస్త్ర దానం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని స్థానిక వెంగళరావు నగర్‌లో పీటర్ పాల్ మినిస్ట్రీ అధినేత వారి కుమారుడు మేనల్లుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. 500 మంది పేదలకు వస్త్రధానాన్ని అనంతరం ఉచితంగా పేదలకు వైద్యం, అన్నదాన కార్యక్రమాలు, జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం, వారికి కావలసిన సదుపాయాలను పేదలను అక్కున చేర్చుకొని ఆపరేషన్లు కావలసిన వారికి అర్హులకు ఉచితంగా చేయించి వారికి తోడుగా ఉంటామని దేవరకొండ సుధీర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ కన్వీనర్ పీటర్పాల్ కోఆర్డినేటర్ అడ్వకేట్ శివప్రసాద్ రెడ్డి, గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు దావీదు, జిల్లా అధ్యక్షులు పాలకీర్తి రవి, తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రశేఖర్, జగన్, శానం హరి, వైసీపీ నాయకులు కలికి రాజేందర్ రెడ్డి, టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ ఎస్కే మస్తాన్, దైవ సేవకులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలకు నరకయాతనగా నల్లపురెడ్డిపల్లి రోడ్డు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో నల్లపురెడ్డిపల్లిరోడ్డుగా పిలువబడే మూడు గ్రామాల రహదారి దశాబ్దకాలంగా ప్రజలకు నరకం చూపుతోంది. ఈరోడ్డు అడుగడుగునా పెద్ద గుంటలు పడి తీవ్ర అసౌకర్యంగా ఉంది. కనుపూరుపల్లి, మురుగుళ్ళ, నల్లపురెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఈరోడ్డు పై ప్రయాణం చేయడం అత్యంత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈమూడు గ్రామాల వారు దశాబ్దకాలంగా తమ వేదనను వినిపిస్తూనే ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు తమ అవస్థలు వివరిస్తూనే ఉన్నారు. కాగా రెండేళ్ళక్రితం ఈరోడ్డుకు మరమ్మత్తులు అంటూ జెసిబితో రోడ్డును పెకలించారు. దాంతో గుంటలకాస్తా తీవ్రమై మరింత ఇబ్బందికరంగా మారింది. ద్విచక్రవాహనకారులు మరింతగా ఇబ్బందిపడుతున్నారు. ఆమార్గంలో బస్ లేకపోగా ఆటోలు అధికంగా నడుస్తుంటాయి. ఆటోల డ్రైవర్లు, అందులో పయనించే ప్రయాణీకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఎన్నికల సమయంలో ఆగ్రామాలకు ఏ ప్రతినిధి వచ్చినా తమ రోడ్డు దుస్థితి, తమ అవస్థలు వివరిస్తూనే ఉన్నారు. ఆసమయంలో వారు హామీలివ్వడమే తప్ప రోడ్డుకు మరమ్మత్తులు మాత్రం చేయడంలేదు. దాంతో ఎంతకాలం తమ అవస్థలు అని వారు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధిప్రదాతగా నాడునేడు పేరుగాంచిన రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈరోడ్డుపై కాస్తంత దృష్టిసారిస్తే తమ సమస్యలు వెంటనే తొలగిపోతాయని, ఆయన వెంటనే శ్రద్ధమాపాలని మురుగుళ్ళ, కనుపూరుపల్లి, నల్లపురెడ్డిపల్లి గ్రామాలవారు, ఆమార్గాన వెళ్ళే ఇతర ప్రాంతాలవారు కోరుతున్నారు.

### రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన

# దుకాణాలు, నిర్మాణాలను తప్పనిసరిగా తొలగిస్తాం

## కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ దుకాణాల ఏర్పాటుకోసం నిర్మాణాలు చేపట్ట వద్దని, నగరాభివృద్ధిలో భాగంగా మార్జిన్ దాటిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ వై.ఓ. నందన్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వైఓ నందన్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర అభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వ స్థలాలు, కార్పొరేషన్ స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల సూచనల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశించిన జోన్లలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకునేలా రోడ్డు మార్జిన్ వ్యాపారులకు మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. నిర్దేశించిన రోడ్డు మార్జిన్ ప్రతి ఒక్కరు గుర్తించేలా అన్ని ప్రాంతాలలో మార్కింగ్ చేయనున్నామని కమిషనర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 3, ఆప్కాస్ 7, అడ్మినిస్ట్రేషన్ 2, ఇంజనీరింగ్ 6, హౌసింగ్ సెక్షన్ 18, పబ్లిక్ హెల్త్ 4, రెవెన్యూ 5, టౌన్ ప్లానింగ్ 8, మొత్తం 53 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, టిపిఆర్ఓ వాసు బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రఘునాధరావు,అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ వ్యాపారస్తులకు అండగా ఉంటాం

- భరోసా ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- అగ్నిప్రమాదానికి గురైన మార్కెట్ లోని దుకాణాలను పరిశీలించిన మంత్రి
- బాధితులకు నేనున్నానని, అన్ని విధాల ఆదుకుంటామని ధైర్యం చెప్పిన మంత్రి నారాయణ




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** అగ్ని ప్రమాదానికి గురైన నెల్లూరు సంతపేట పాత దుస్తుల మార్కెట్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం పరిశీలించారు. బాధిత దుకాణదారులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేనున్నానంటూ వ్యాపారస్తులకు మంత్రి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. మార్కెట్లో అగ్నిప్రమాద విషయం తెలియగానే అందరిని అప్రమత్తం చేశానని తెలిపారు. వ్యాపారులకు అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పానని.. ప్రమాదానికి గురైన షాపులను ఆయన పరిశీలించినట్లు వివరించారు. వచ్చే సోమవారంలోపు రెన్యువేషన్ పనులను పూర్తి చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు చెప్పిన విధంగా నష్టపరిహారం త్వరలోనే అందజేస్తామని మంత్రి తెలిపారు. 2014లో సంతపేట మార్కెట్‌ను అభివృద్ధికి శ్రీకారం చుట్టామని అయితే 90శాతం పనులు కూడా పూర్తి చేసామని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ప్రారంభించలేదని మండిపడ్డారు. మార్కెట్ వ్యాపారస్తులందరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ మాజీ జెడ్పిటిసి విజేతారెడ్డి నగర అధ్యక్షుడు మామిడాల మధు, నగర మహిళా అధ్యక్షులు కపిర రేవతి, కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తకు స్వచ్ఛతా అవార్డు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరుకు చెందిన అంగన్వాడీ కార్యకర్త కేశవరత్నమ్మ స్వచ్ఛతా అవార్డ్‌కు ఎంపికైంది. సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల చేతులమీదుగా ఆమె ఈ అవార్డ్ స్వీకరించారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. దాంతో కేశవ రత్నమ్మ ను అవార్డ్‌కు ఎంపిక చేశారు, కలెక్టర్ శుక్ల, జెడ్పి చైర్మన్ ఆనం అరుణమ్మ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరుల చేతుల మీదుగా ఆమె అవార్డ్ అందుకున్నారు. ఆమెకు అవార్డ్ రావడం పట్ల ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.



## భ్రూణ హత్యలను నివారించాలి : ఆర్డీఓ



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భ్రూణ హత్యలు నివారించి, ఆడ, మగ శిశువుల మధ్య వివక్షతను విడనాడాలని కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి వంశీకృష్ణ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆర్డిఓ చాంబర్లో లింగ నిర్ధారణ నిషేధిత చట్టం కావలి డివిజన్ సలహా కమిటీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణ అనంతరం వారు మాట్లాడుతూ.. భేటీ బచావో బి భేటీ పడావో ఆడపిల్లలను చదివిద్దాంబి రక్షిద్దాం అనే నినాదంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ డాక్టర్ బ్రిజిత, సిడిపిఓ సౌజన్య, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డా.అనూష, రెండవ పట్టణ ఎస్ఐ ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో పోటీ పరీక్షల కేంద్రం ప్రారంభం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యు)లో పోటీ పరీక్షల కేంద్రం (సెంటర్ ఫార్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్)ను ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు 'యుపీఎస్‌సీ' రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, వివిధ కార్పొరేట్ పరీక్షలపై అవగాహన, మార్గదర్శకత్వం, శిక్షణ, కోచింగ్ అందించనున్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ కేంద్రం విద్యార్థులను సమర్థులైన, బాధ్యతాయుతమైన ప్రజా సేవకులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. అతను బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జె.విజేతను ఈ కేంద్రానికి డైరెక్టర్‌గా నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డా. కె.సునీత, కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. సిహెచ్ విజయ తదితరులు డా. విజేతను అభినందించారు. అధికారులు పేర్కొంటూ ఈ కేంద్రం విద్యార్థుల్లో పోటీ పరీక్షల పట్ల ఆసక్తి పెంపొందించడంతోపాటు, భవిష్యత్తులో సమాజపట్ల బాధ్యతగల నాయకులుగా ఎదగడానికి దోహదం చేస్తుందని తెలిపారు.

## రేపు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు రోడ్డు లోని పీఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఈనెల 8వ తేదీన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ చైర్మన్ వై.రంగయ్య నాయుడు పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా జర్నలిస్టు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. సూపర్ జిఎస్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రత్యేక అతిథులుగా జిల్లా కలెక్టర్, గౌరవ అతిథులుగా జీఎస్టీ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు పాల్గొనున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ సమావేశానికి తమ కామర్స్ తరఫున సంఘీభావం ప్రకటిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రతి వ్యాపార సంఘాలు, వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ కామర్స్ సభ్యులు ఎస్వీ రమేష్ బాబు, ఎం.బాల రామానాయుడు, కే.సాయికుమార్, జేవి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మైదానాలు లేక ఆటలకు ఆటంకాలు

## స్టేడియంకు మోక్షం కల్పించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో తగు మైదానాలు, ఆటస్థలాలు లేక ఆటలు, క్రీడలకు ప్రోత్సాహం కరువైందని సర్వత్రా వాపోతున్నారు. విద్యాసంస్థల్లో కానీ, ఇతర ప్రాంతాల్లో కానీ తగిన మైదానాలు, ఆటస్థలాలు లేవు. ఆటలు, క్రీడలను ప్రోత్సహించాలన్న లక్ష్యంగా 13 సంవత్సరాల క్రితం అప్పటి ఆత్మకూరు శాసనసభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులో స్టేడియం నిర్మాణానికి ఒకకోటి రూపాయలు నిధులు మంజూరు చేయించి టెండర్ ప్రక్రియను పూర్తిచేయించి పనులు ప్రారంభింపజేశారు. స్టేడియం నిర్మాణం కొంతవరకు పూర్తయి నిలిచిపోయింది. అనంతరం వచ్చిన పాలకులు ఎవ్వరూ ఈ స్టేడియం నిర్మాణం గురించి కనీసం యోచించిన దాఖలాలు లేవు. ఏదేని ఆటలు,క్రీడల పోటీల సందర్భంగా ప్రజాప్రతినిధులు అతిథులుగా హాజరుకావడం, తాము ఆటలు,క్రీడలకు అధికప్రాధాన్యత ఇస్తామని, క్రీడామైదానాలను, పార్కులను వృద్ధిచేస్తామని ప్రకటించడం, కరతాళధ్వనులతో జనాలు సంబరపడడం, అనంతరం నేతలు ఏమాత్రం ఆ విషయం గురించి పట్టించుకొన కపోవడం పరిపాటిగా మారింది. యువత ఏదేని పొలాల్లో కాసింత విశాలంగా జాగా కన్పిస్తే అక్కడ ఆటలాడుకోవడం కన్పిస్తుంటుంది. విద్యార్థులైతే పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో తీరికవేళల్లో ఆటలాడుకోవడం జరుగుతుంది. అంతేతప్ప నిర్దిష్టమైన ఆటమైదానం లేదా స్టేడియం లేకపోవడం అత్యంత అసౌకర్యంగా ఉంటోంది. 13సంవత్సరాలుగా అర్ధాంతరంగా నిర్మాణం నిలిచిపోయిన స్టేడియం గురించి పాలకులు కానీ, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకొనకపోవడం అత్యంత విడ్డూరంగా ఉంది. కొంతమేరకు నిధులు వెచ్చించి నిర్మాణం జరిగిన స్టేడియం గురించి పాలకులకు ఎందుకు పట్టదని పదేపదే పట్టణవాసులు ప్రశ్నిస్తూనే ఉన్నా ఫలితం లేకపోయింది. కాగా ఆనాడు ఆత్మకూరుకు స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఆత్మకూరు అభివృద్ధిప్రదాత ఆనం రామనారాయణరెడ్డి తాజాగా ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. గతంలో దాదాపు 2500కోట్ల రూపాయలతో ఆత్మకూరులో అనేక అభివృద్ధికార్యక్రమాలు చేసిన రామనారాయణరెడ్డి ఈదఫా కూడా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఆయన ఈ స్టేడియం గురించి దృష్టి సారించి పూర్తిచేయించి విద్యార్థులు, యువతకు ఆటలు, క్రీడలకు అవకాశం కల్పించాలని సర్వత్రా కోరుతున్నారు.

## చిరు వ్యాపారుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. 75 మంది వీధి వ్యాపారులకు మంత్రి నారాయణ ఒకేసారి తోపుడుబండ్లు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలు అయిపోయాక 476 మందికి తోపుడుబండ్లను ఇప్పటివరకు మంత్రి అందచేసారని తెలిపారు. దీంతో చిరు వ్యాపారులు బాడుగకు బండ్లు తీసుకొనే బాధ లేకుండా చేసారన్నారు. సంచార వ్యాపారంతో ఆదాయాన్ని పెంచుకొనే అవకాశం కల్పించారని, వ్యక్తిగా మంత్రి నారాయణ గొప్ప మనసును చాటుకొంటున్నారన్నారు. అభివృద్ధి అంటే నారాయణ - నారాయణ అంటే అభివృద్ధి ఇది నిజం అని హర్షం వ్యక్తం చేశారు.రాజధాని నిర్మాణంలో కూడా నారాయణ సార్ భాగస్వామి అయ్యారన్నారు. మన నెల్లూరు ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారన్నారు. తదనంతరం నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఏడాదికి పది కోట్ల సొంతనిధిని కార్యకర్తలకు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ సార్ అని కొనియాడారు. ఆయన ఏదైనా పూర్తి స్థాయిలో చేస్తారని, అందరు నేతల్లా మమ అనిపించే వ్యక్తి కాదన్నారు. ఇప్పటివరకూ 476 తోపుడు బండ్లు పంపిణీ చేశారన్నారు. ఆపద వస్తే నేనున్నాననే భరోసా ఇచ్చే వ్యక్తి మంత్రి అన్నారు. అలాంటి నాయకుడు చిక్కడం సిటీ వాసుల అదృష్టం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జేడ్పీటీసీ విజేతా రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# సంస్కరణలు తెచ్చినా పథకాలు అమలు చేస్తున్నా మార్పురాని పాఠశాలలు

## ఆత్మకూరులో 11పాఠశాలల్లో 10లోపు విద్యార్థులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ఎన్నిసంస్కరణలు తెచ్చినా ఎన్ని పథకాలు అమలుచేస్తున్నా విద్యాలయాల్లో మార్పులు రావడం లేదని వెల్లడవుతుంది. విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. వైసిపి ప్రభుత్వం గతంలో ఇచ్చిన జివో 117ను రద్దుచేయడంతో ఇకనైనా గ్రామీణ ప్రాంత పాఠశాలల మనుగడ సాగిస్తాయా అంటూ ప్రజలు చర్చించుకుంటుండగా కూటమి ప్రభుత్వం వచ్చాక పలు మార్పులు, సంస్కరణలు తెచ్చినా ఫలితాలు ఆశాజనకంగా కానరావడం లేదు.. జాతీయవిద్యావిధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం పలు పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనంచేస్తూ 117 జివో విడుదల చేసి అమలుచేయడంతో అనేక పాఠశాలలు మూతపడడం, పలు పాఠశాలలు 10లోపు విద్యార్థులతో సాగుతుండడం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఆ జివోను రద్దుచేసి కొత్తగా మాడల్‌స్కూళ్ళు ఏర్పాటు, క్లస్టర్ విధానం అమలు, ప్రాథమికోన్నత పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనంచేసేలా నిర్ణయించారు. గతంలో ఉన్నతపాఠశాలల్లో విలీనంచేసిన 3, 4, 5తరగతుల విద్యార్థులను మళ్ళీ ప్రాథమిక పాఠశాలలకే పంపేలా నిర్ణయించారు. దాంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు మనుగడ సాగిస్తాయని అందరూ భావిస్తుండేవారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తాం, విద్యార్థుల ఉజ్వలభవిష్యత్తుకు ప్రాథమిక దశలోనే పునాదులు వేస్తాం, ఆంగ్లమాధ్యమం ప్రవేశపెడుతున్నాం, చిన్నారులందరినీ సర్కారు బడులకు రప్పిస్తాం, అమ్మఒడి, మధ్యాహ్నభోజనం, విద్యాదీవెన, విద్యాకానుక, యూనిఫారం దుస్తులు, బూట్లు,టైలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇస్తాం అంటూ ఎన్నెన్నో ప్రయోగాలను వైసిపి ప్రభుత్వం అమలుచేసినా తీరా చూస్తే ఏఏటికాఏడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. తల్లిదండ్రులు కాన్వెంట్లపై మోజు పెంచుకుంటుండేవారు. ఆత్మకూరు మండలంలో గత 3 విద్యా సంవత్సరాలు, ఈ విద్యాసంవత్సరం పరిశీలిస్తే విద్యార్థుల సంఖ్య రెండేళ్ళు పెరగకపోగా తగ్గిపోయింది. ఈఏడాది మాత్రం స్వల్పంగా విద్యార్థుల సంఖ్య పెరిగినా కొన్నిపాఠశాలల్లో నమోదైన సంఖ్యలు సందేహంగా ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. గత ప్రభుత్వ హయాంలో తరగతుల విలీనం, కొత్తతరగతుల ఏర్పాటు తదితర కారణాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తాజా తెలుగుదేశం ప్రభుత్వం ప్లస్‌టు రద్దు, తరగతుల విలీనం రద్దు తదితర నిర్ణయాలను తీసుకుంటుండడంతో ఇకనైనా విద్యావ్యవస్థ గాడినపడుతుందా అని జనాలు కొండంత ఆశతో ఎదురుచూస్తుండగా వారు కూడా కొద్ది మార్పులతో అదేపంథా అనుసరిస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ఈ విద్యాసంవత్సరం పరిశీలిస్తే ఉన్నతపాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 71 ప్రభుత్వపరంగా ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం ఆరంభమై అడ్మిషన్లు పూర్తయ్యాక పరిశీలించగా ఈ71పాఠశాలల్లో 1నుండి 10 తరగతుల విద్యార్థుల సంఖ్య 4646గా ఉండగా 14 ఉన్నత పాఠశాలల్లో 2646 మంది విద్యార్థులు కాగా మిగతా 57 ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 2000 మంది మండలంలో మాత్రమే ఉన్నారు. గత సంవత్సరం విద్యార్థులు లేక మండలంలోని రావులకొల్లు, ఆరవేడుజంగాలపల్లి, అల్లీపురం పాఠశాలల్లో విద్యార్థులు గతంలో ఉన్నవారు వెళ్ళిపోగా సున్న నమోదు కావడంతో ఆపాఠశాలలు మూతపడ్డాయి. మండలంలోని 10మందికన్నా విద్యార్థులు తక్కువగా 11పాఠశాలలు, 20మందికన్నా తక్కువగా 11పాఠశాలలున్నాయి. అప్పారావుపాళెం ఈస్ట్ పాఠశాలలో 7మంది, అశ్వనీపురం పాఠశాలలో 8మంది, గొల్లపల్లి పాఠశాలలో 7మంది, కరటంపాడు మెయిన్ పాఠశాలలో 10మంది, ఎల్‌ఆర్‌పల్లి ఉర్దు పాఠశాలలో 6మంది, నల్లపురెడ్డిపల్లి పాఠశాలలో 6మంది, నరసాపురం పాఠశాలలో 4మంది, పేరారెడ్డిపల్లి ఎస్టీ పాఠశాలలో 10మంది, సాతానుపల్లి పాఠశాలలో 3మంది, టి.ముస్తాపురం పాఠశాలలో 7మంది, వాసిలి ఎస్‌సి పాఠశాలలో 5మంది మాత్రమే విద్యార్థులుండడంతో ఈ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. బంట్లపల్లి పాఠశాలలో 21మంది, బి.చిరువెళ్ళ పాఠశాలలో 21మంది, బొటికర్లపాడు పాఠశాలలో 21మంది, బి.చిరువెళ్ళ ఎస్‌సి పాఠశాలలో 21మంది, మురుగుళ్ళ ఎస్‌సి పాఠశాలలో 12మంది, నబ్బీనగరం పాఠశాలలో 22మంది, శాంతినగరం పాఠశాలలో 22మంది, పడకండ్ల పాఠశాలలో 17మంది, టెక్కె ఉర్దుపాఠశాలలో 16మంది, వాసిలి నార్త్ ఎస్‌సి పాఠశాలలో 22మంది విద్యార్థులున్నారు. ఉపాధ్యాయుల పోస్టులు పోకుండా ఏదేని జాగ్రత్తలు పద్దారా అనే సందేహం కూడా పలువురిలో ఉంది. ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి ఉర్దుపాఠశాలలో 2021-22లో ఒక్క విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు, 2022-23లో నలుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఈదఫా ఆరుమంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఒక స్వీపర్‌కూడా పనిచేస్తుండగా ఈపాఠశాలకు రెండు పక్కా భవనాలుండగా రిపేర్లు, బాత్‌రూముల నిర్మాణాన్ని గత ప్రభుత్వం 12లక్షల రూపాయలుతో చేసింది. రావులకొల్లులో రెండేళ్ళ క్రితం ఐదుమంది, గత సంవత్సరం ముగ్గురు విద్యార్థులు, ఈఏడాది మూతపడి ఉండగా అక్కడ రెండు భవనాలుండగా మళ్ళీ 17లక్షల రూపాయలతో భవనాలు నిర్మించారు. నాడు-నేడు అంటూ అవసరం ఉన్నాలేకున్నా లక్షలాదిరూపాయలు వెచ్చించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఈపరిస్థితి ఏర్పడింది. వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మొన్నటిదాకా అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేకచట్టాలు తేవడం, అనేక యాప్‌లు ప్రవేశపెట్టడం, అనేక పథకాలు అమలు చేయడం అందరికీ తెల్సిందే. దాంతో వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిణామాలతో అనేకమంది తల్లిదండ్రులు తమ బిడ్డలను వ్యయప్రయాసలతో ప్రైవేటు స్కూళ్ళలో చేర్పుతున్నారు. ఇక 14సంవత్సరాల లోపు చిన్నారులు బడి బయట ఉండరాదని, అనేక చట్టాలు అమలు చేస్తున్నా చిత్తుకాగితులు సేకరించడం, ఇతరత్రా పనుల్లో నిత్యంత బయట డ్రాపవుట్స్‌గా కన్పిస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 76కాగా 2021-22లో 5503మంది విద్యార్థులు కాగా 2022-23లో 5126మందిగా, 2023-24లో 4481మంది విద్యార్థులు, ఈదఫా 4646మంది విద్యార్థులున్నారు. ఏటా ఎన్నెన్నో కోట్ల రూపాయలతో అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్న ప్రయోగాలు చేస్తున్నా విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉండగా ఒక్క ఆత్మకూరు మండలంలోనే 10మందికన్నా తక్కువవిద్యార్థులున్న పాఠశాలలు 11 కాగా 20మందికన్నా తక్కువగా 11పాఠశాలలుండడం గమనార్హం, ముగ్గురు, నలుగురు, ఐదుమంది విద్యార్థులున్నచోట వారు ఖచ్చితంగా ఆ పాఠశాలలో చదివేవారేనా, పాఠశాల ఉనికికోసం ఒకటి,రెండు పేర్లు తూతూమంత్రంగా నమోదుచేశారా అనే సందేహంకూడా ఉంది. గత ప్రభుత్వం పలు ప్రాథమిక పాఠశాలల్లోనుండి 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు పంపినా అక్కడ వారికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదు. ఉన్నత పాఠశాలలో జూనియర్‌కాలేజి అని ప్రకటించిన వైసిపి ప్రభుత్వం ఆత్మకూరులో మూడేళ్ళ క్రితం ఒక మహిళాజూనియర్‌కాలేజిని ప్రారంభించి ఒక్కరినీకూడా సిబ్బందిని, అధ్యాపకులను నియమించనందున ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులే బోధించగా పరిక్షల్లో ఈకాలేజీలో అత్యధికంగా విద్యార్థినిలు ఇంటర్‌లో ఫెయిల్‌కాగా ప్రభుత్వం తమ ప్రయోగం విఫలమైందని భావించి కాలేజిని మూసివేశారు. ఈనూతన ప్రభుత్వం గత చట్టాలను మార్చి అస్తవ్యస్తంగా మారిన విద్యావ్యవస్థను సక్రమబాటలోకి తేవాలని, విద్యార్థులు అధికంగా కోట్లాదిరూపాయలు వెచ్చించే ప్రభుత్వపాఠశాలల్లో చేరేలా చూడాలని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

# హరిణి క్యాటరింగ్స్, హరిణి హెూటల్ ప్రారంభం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక శ్రీహరి నగర్ లో హరిణి క్యాటరింగ్, హరిణి హెూటల్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిణి క్యాటరింగ్స్ హెూటల్ అధినేత పెంచలయ్య (సీపీ)కి అభినందనలు తెలియజేశారు. అనంతరం కార్పోరేటర్ చేజర్ల మహేష్, క్యాటరింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వినయ్ లు మాట్లాడుతూ పెంచలయ్య హెూటల్ పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా ఉన్నారని నెల్లూరు ప్రజల అభిరుచికి అనుగుణంగా అల్పాహారంతో పాటు చక్కటి వంటకాలతో హెూటల్ ను తిరిగి అందుబాటులోకి తీసుకొని వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, ఓట్టూరు సురేంద్ర యాదవ్, మదపర్తి శ్రీనివాసులు, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, మూలే విజయభాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి, అరవ శ్రీనివాసులు, కరణం హజరత్ నాయుడు, చెక్క సాయి సునీల్, క్యాటరింగ్ అసోసియేషన్ వినయ్, నెల్లూరు క్లబ్ కార్యదర్శి అశోక్, సాబీర్ ఖాన్, లీలా, యానాదయ్య, కోటిరెడ్డి, పులి హరికృష్ణ, భీమతాటి సుధాకర్, తోట శోభారాణి, చేజర్ల కవిత, పద్మజ యాదవ్ పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి
- ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 83310 57285 ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని.. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను పూర్తిగా అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అంతర్గత తనిఖీ బృందాలను నియమించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించి నకిలీ విత్తనాలు, ఎరువులు, అక్రమ యూరియా నిల్వలపై ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ సమస్యలపై ఫిర్యాదులు ఉన్నట్లయితే అన్నదాతలు వెంటనే జిల్లా వ్యవసాయ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 83310 57285కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. జిల్లాలో కల్తీ విత్తనాలు, అక్రమ యూరియా నిల్వలపై ప్రత్యేక బృందాలు తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ ప్రత్యేక బృందాలు క్రమపద్ధతిలో డీలర్లు, గోదాములు, స్టాక్ పాయింట్లలో యూరియా సరఫరా, నిల్వలు, వినియోగంపై సమగ్ర స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు అక్రమ రవాణా, అనధికార వినియోగాన్ని అరికట్టడం, క్రమం తప్పకుండా ఫీల్డ్ స్థాయి తనిఖీలు చేయడం, వ్యవసాయ అధికారులను సమన్వయం చేస్తూ పర్యవేక్షణ చేయడం ఈ ప్రత్యేక బృందాలను ప్రధాన లక్ష్యంగా ఆయన చెప్పారు. జిల్లాలోని రైతులకు సమయానుకూలంగా నాణ్యమైన ఎరువులు అందేలా ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పారు. యూరియా దుర్వినియోగం మాత్రమే కాకుండా, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలలో కల్తీ లేదా అవకతవకలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడిన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

# 11 కోట్లతో అద్భుతంగా పొదలకూరు రోడ్డు నిర్మాణం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని బట్వాడిపాళెం నుంచి డైకాస్ రోడ్డు వరకు 5 కిలోమీటర్లు 11 కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, డ్రైన్, గ్రీనరీ అభివృద్ధి పనులను భారతీయ వాయుసేన విశ్రాంత కార్గిల్ వింగ్ కమాండర్ చేత నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ.. ఈ దేశంకోసం ప్రాణాలు అర్పిస్తున్న సైనికులచేత ఈ పొదలకూరు రోడ్డును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలతోనే ఉంటా. ఎమ్మెల్యే అంటే మా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి లా ఉండాలి అనే గర్వంగా చెప్పుకునే విధంగా పనిచేస్తానన్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనా నేడు చంద్రబాబు నాయుడు తన అపారమైన అనుభవంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అమరావతి రాజధానిని, పోలవరాన్ని పరుగులు పెట్టిస్తు న్నారన్నారు. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, యువనేత నారా లోకేష్కి మీ అందరి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ భాను శ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ జనసేన కోఆర్డినేటర్ పావుజెన్ని చంద్రశేఖర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఫ్లెక్సీలు వేస్తే కేసు నమోదు చేస్తాం : సిటీ ప్లానర్ హిమబిందు

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డివైడర్లపై కమిషనర్ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అట్టి వారిపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారనితెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశముల ప్రకారం ఫ్లెక్సీలను నిషేదించడమైందని ఆమె తెలిపారు. కావున నగరంలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయుట వాల్ పోస్టర్లు రోడ్లు డివైడర్లకు గోడలపై అంటించిన ఏర్పాటు చేసిన వారిపై కేసు వేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిటీ ప్లానర్ తెలిపారు.

## పీఎంజేజేబీవై పథకంద్వారా చెక్కు పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరుకు చెందిన పన్నగంటి శ్రీనివాసులుకు పిఎంజెజెబివై పథకంద్వారా మంజూరైన 2లక్షలరూపాయల చెక్కును సోమవారం మహిమలూరు ఏపిజిబి మేనేజర్ ఫిరోజ్, ఆత్మకూరుకు చెందిన ఎస్ఎస్‌టి ఆర్థిక అక్షరాస్యతాకేంద్ర కౌన్సిలర్లు టి.రాజేష్‌కుమార్, డి.విజయ్‌కుమార్, కె.పెంచలస్వామిలు అందజేశారు. శ్రీనివాసులు భార్య ఇటీవల మృతిచెందగా పిఎంజెజెబివై పథకంద్వారా సిఎఫ్ఎలు చేసిన క్లెయిమ్ ద్వారా నామినీగా ఉన్న ఆయనకు ఈ నగదు మంజూరైంది. చెక్కును శ్రీనివాసులకు అందజేశారు. తనకు ఆర్థికపసాయం లభింపజేసిన ఏపిజిబి మేనేజర్ ఫిరోజ్, ఆత్మకూరు ఆర్థికఅక్షరాస్యతా కేంద్ర కౌన్సిలర్లు రాజేష్‌కుమార్, విజయకుమార్, పెంచలస్వామిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యం

- ప్రతి అర్జీని జాప్యం లేకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అర్జీదారులు సంతృప్తిచెందేలా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌వో విజయకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పట్ల జాప్యం లేకుండా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఏ శాఖ పరిధిలో కూడా అర్జీలు పెండింగ్లో ఉండకూడదన్నారు. ప్రతిరోజూ తమ లాగిన్‌లలో అర్జీలను స్టేటస్ పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

# 47 పార్కులు సర్వాంగ సుందరంగా ఆధునీకరణ

● ఏసీ నగర్లో రూ.25 లక్షలతో ఆధునికరించిన మాగుంట సుబ్బరామిరెడ్డి మున్సిపల్ పార్క్ ● పార్కును అట్టహాసంగా ప్రారంభించిన మంత్రి నారాయణ ● నగరంలో ఇప్పటికే 40 పార్కులు ఆధునీకరణ పూర్తి ● దోమలు లేని నెల్లూరు నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం ● అభివృద్ధి పనులకు కాలువలు ఆక్రమణదారులు సహకరించాలని కోరిన మంత్రి నారాయణ





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజల మానసిక ఉల్లాసానికి పార్కులను విరివిగా అభివృద్ధి చేస్తున్నామని.. అలాగే నెల్లూరు నగరాన్ని దోమలు లేని నగరంగా తీర్చిదిద్దే విధంగా కాలువలను మరమ్మతులు చేయడానికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ కోరారు. నెల్లూరు 14వ డివిజన్లోని ఏసీ నగర్‌లో రూ.25 లక్షలతో ఆధునికరించిన మాగుంట సుబ్బరామిరెడ్డి మున్సిపల్ పార్కును సోమవారం మంత్రి నారాయణ అట్టహాసంగా ప్రారంభించారు. డివిజన్ కు ఇచ్చేసిన మంత్రికి స్థానిక టిడిపి శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. కాసేపు పార్కులో అందరితో సరదాగా మాట్లాడారు. ఏర్పాట్లను క్షుణ్ణంగా మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ నెల్లూరు నగర పరిధిలోని 47 పార్కులకు గాను 40 పార్కులను ఆధునీకరించడం జరిగిందన్నారు. అలాగే మరో ఏడు పార్కులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మాగుంట సుబ్బరామిరెడ్డి పార్క్‌లో వాకర్స్ ట్రాక్ సరిగా లేనందున దాన్ని మరమ్మతులు చేసి పకడ్బందీగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. అదేవిధంగా పార్క్ కమిటీ కోరిక మేరకు మూత్రశాలలు, టాయిలెట్లు ఏర్పాట్లు చేయవలసిందిగా మున్సిపల్ కమిషనర్ ని ఆదేశించారు. 51, 49 డివిజన్లో కూడా పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పిల్లలకు పెద్దలకు ఉపయోగపడే విధంగా పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.అవకాశం ఉన్నచోట బోట్ షికార్‌ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని బోడి గాడి తోట వద్ద ఉన్న పార్క్‌ని వాటర్ పార్కుగా తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నగరంలో ప్రవహిస్తున్న వివిధ రకాల డ్రైన్‌లకు సైడ్ వాల్స్ నిర్మించుటకు మార్కింగ్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని, సైడ్ వాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా దోమల నివారణకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. గతంలో రూ.1100 కోట్ల రూపాయలు వెచ్చించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటుకు రూ.960 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని మరో రూ.160 కోట్లను. నేడు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉదాహరణకు ఉయ్యాల కాలువ రామిరెడ్డి కాలువ, తదితరులు ఉన్నాయని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం వినియోగించుకునేందుకు నుండి ఇచ్చుటకు గాను కేవలం రూపాయి చెల్లించవలసి ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నగరంలో పినాకిని, చిల్డ్రన్స్ పార్క్ వాటిని అభివృద్ధి చేయడం జరుగుతుందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## వీఎస్‌యూ విద్యార్థికి రాష్ట్రపతి చేతుల మీదుగా

# జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ వాలంటీర్ అవార్డు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమసింహాపురి విశ్వవిద్యాలయం (వి.ఎస్.యూ), నెల్లూరు బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎం.పృథ్వీరాజ్ సామాజిక సేవలో చేసిన విశిష్ట కృషికి గాను జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అవార్డు అందుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును నేడు న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ వేడుకలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల యన్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'ఇది మా విశ్వవిద్యాలయానికి గర్వకారణం. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలో అంకితభావాన్ని ప్రదర్శించడం విశేషం. పృథ్వీరాజ్ సాధించిన ఈ జాతీయ అవార్డు ఇతర యువతకు ప్రేరణగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. 'పృథ్వీరాజ్ సాధించిన ఈ జాతీయ గౌరవం వీఎస్‌యూ ప్రతిష్ఠను మరింత పెంచింది. విద్యార్థులు విద్యా ప్రగతితో పాటు సామాజిక బాధ్యతల పట్ల చూపుతున్న నిబద్ధత విశ్వవిద్యాలయానికి గర్వకారణం' అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. విజయ



మాట్లాడుతూ.. 'మా కళాశాల విద్యార్థి పృథ్వీరాజ్ జాతీయ స్థాయిలో యన్ఎస్ఎస్ ఉత్తమ వాలంటీర్ అవార్డును అందుకోవడం విశేష గౌరవం. ఈ విజయంతో మా కళాశాల ప్రతిష్ఠ మరింత పెరిగింది' అని తెలిపారు. యన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయశంకర్ అల్లం మాట్లాడుతూ.. 'పృథ్వీరాజ్ పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన కృషి యన్ఎస్ఎస్ యూనిట్ల ప్రతిష్ఠను జాతీయ స్థాయికి చేర్చింది' అని అభినందించారు. జాతీయ అవార్డును స్వీకరించిన అనంతరం ఎం.పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. 'ఈ అవార్డు నాకు మాత్రమే కాకుండా మా వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ యూనిట్ మొత్తానికి దక్కిన గౌరవం. సమాజ సేవలో మరింత కృషి చేస్తూ గ్రామీణాభివృద్ధి, యువత శ్రేయస్సు కోసం కొనసాగుతాను' అని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఆయనను హృదయపూర్వకంగా అభినందించారు.

## శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం మధ్యాహ్నం హుండీ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆగస్టు 29వ తేదీ నుండి తేది సెప్టెంబర్ 6వ తేదీ వరకు (39 రోజులకు) దేవదాయ ధర్మదాయ శాఖ, పర్యవేక్షణ అధికారి డి.శ్రీనివాస్ ఆధ్వర్యములో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా దేవస్థానానికి రూ.3,57,773 హుండీ ద్వారా ఆదాయం లభించింది. ఈ కార్యక్రమం లో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్ ఇతర సభ్యులు, ముఖ్య అర్చక పి.చంద్రశేఖర్ స్వామి, పి.దైవజ్ఞ ఆచార్యులు అర్చక స్వామి, పరకామణి సేవా సభ్యులు పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## కరటంపాడుకు ఉత్తమపంచాయతీ అవార్డు

▶ కలెక్టర్ నుండి అవార్డు అందుకున్న కార్యదర్శి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటం పాడు స్వచ్ఛ పంచాయతీగా ఎంపికైంది. సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా కరటంపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ ఈ అవార్డును స్వీకరించారు.



నెల్లూరు జిల్లాలో ఐదు పంచాయతీలు స్వచ్ఛపంచాయతీలుగా ఎంపిక య్యాయి. ఆత్మకూరు మండలం కరటంపాడు, మర్రిపాడు మండలం బూదవాడ, సంగం, వింజమూరు, ఉలవపాడు మండలకేంద్ర పంచాయ తీలు ఎన్నికయ్యాయి. కరటంపాడులో స్వచ్ఛత సాధించడంలో ప్రథమ స్థానంలో తఉండడంతో ఈపంచాయతీని స్వచ్ఛపంచాయతీ అవార్డుకు ఎంపికచేశారు. దాంతో కలెక్టర్ నుండి కార్యదర్శి షఫీ అవార్డును అందు కున్నారు. ఈ అవార్డు రావడంపట్ల గ్రామ సర్పంచ్ పూనుగుంట రేవతి, ఈపంచాయతీ పారిశుధ్యమెరుగుకు 5లక్షల రూపాయల ట్రాక్టర్‌ను విరాళంగా సమకూర్చిన గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్, మాజీ ఉప మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు దావా పెంచలరావు, మాజీ సర్పంచ్ పఠాన్ సాబ్జాన్‌ఖాన్, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యదర్శిని, సిబ్బందిని వారు అభినందించారు.

## 9 నుండి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల వింజమూర్ నందు 09.10.25, 10.10.25 రెండు రోజులలో జరుగును. 9వ తేది గురువారం ఉదయం 9:30 నిమిషాలకు అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు ఆల్ అథ్లెటిక్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని



విద్యాశాఖ అధికారి రమేష్ తెలియజేశారు. జంపింగ్, త్రో బాల్, యోగ, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ విభాగాల నందు సెలక్షన్స్ జరుపబడును. అదేవిధంగా శుక్రవారం 10వ తేదీ ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలకు అండర్ 14, 17 బాల బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, క్రీడల నందు సెలక్షన్స్ జరుపబడును.అన్ని విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చునీ తెలిపేరు. ఇక్కడ మండల స్థాయిలో సెలెక్ట్ అయిన విద్యార్థులు తర్వాత కావలి డివిజన్ స్థాయిలో పాల్గొనవలెను. అదేవిధంగా డివిజన్ స్థాయిలో సెలెక్ట్ అయిన విద్యార్థులు డిస్టిక్ లెవెల్‌లో సెలక్షన్స్‌కి హాజరు అవ్వాలని సూచించారు.